




నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు శ్రీధర్

ముగిసిన నామినేషన్ల ఘట్టం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

ఎంఎల్‌సి అభ్యర్థుల నామినేషన్ ఘట్టం గురువారంతో ముగిసింది. తూర్పు రాయలసీమ నియోజకవర్గం చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సీ స్థానాల నోటిఫికేషన్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ హరినారాయణ్ ఈనెల 16వ తేది నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం అంటే 23వ తేదికి నామినేషన్ల స్వీకరణ సాయత్రం మూడు గంటలకు ముగిసింది. 24వ తేది శుక్రవారం నామినేషన్లను పరిశీలన, 27వ తేది నామినేషన్ల ఉపసంహరణ తరువాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాతో పోలింగ్ స్లీప్ సిద్ధం కానుంది. క్రమ సంఖ్య అభ్యర్థుల ఫోటో పేర్లు మాత్రమే ఈ ఓటరు బ్యాలెట్ పత్రంలో ఉంటాయి. వరస క్రమంలో ఓటరు ఎంపిక చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో అంకెల రూపంలో ఎన్నికల నోడల్ అధికారి ఇచ్చే పెన్‌తో మాత్రమే అంకెల రూపంలో మార్చి 13వ తేది నిర్వహించనున్న పోలింగ్‌లో ఓట్లు వేయాల్సి ఉంటుంది. బ్యాలెట్ పత్రాలను భద్రపరిచేందుకు పివికెయన్ డిగ్రీ కళాశాల, ఎఫ్‌సిఐ గోడౌన్, సీతమ్ కళాశాలలను పరిశీలించిన అధికారులు పివికెయన్ డిగ్రీ కళాశాలను ఏంపిక చేశారు. మార్చి 16వ తేది గురువారం కౌటింగ్ నిర్వహించనున్నారు. కౌటింగ్ ప్రక్రియ మూడు రోజులు జరిగే అవకాశముందని ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల పరిశీలకులు శ్రీధర్ గురువారం జిల్లా సచివాలయాన్ని సందర్శించారు. జిల్లా రిటర్నింగ్ అధికారి కలెక్టర్ హరినారాయన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్స్ ప్రక్రియ, పోలింగ్, కౌటింగ్ ఏర్పాట్లపై చర్చించారు.

బలప్రదర్శనలు

అధికార, ప్రధాన ప్రతిపక్షం పార్టీల నుండీ పోటీచేస్తున్న అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా కార్లు, ఓపెన్‌టాప్ ప్రచార రథాల్లో హంగామాతో బలప్రదర్శనలు నిర్వహించారు. పీడిఎఫ్ ఎంఎల్‌సీలు ఉద్యోగ, ఉపాధ్యాయ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ప్రజా సంఘాల మద్దతుతో చిత్తూరు నగరంలో పీడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలంటూ కాలినడకన కట్టమంచి చెరువు గట్టు నుండీ నాగయ్య కళాక్షేత్రం వరకు భారీ పాదయత్ర నిర్వహించి విద్యారంగ పరిరక్షణ కోసం చేపట్టాల్సిన చర్యలపై సదస్సు నిర్వహించి పిడిఎఫ్ ఎంఎల్‌సీలు ఎవరి పక్షనా శాసన మండలిలో నిలబడతారో మరో మారు రుజువు చేశారు.

నామినేషన్లు ఇలా...

అధికార, ప్రతిపక్షం ప్రత్యక్షంగా రంగంలోకి దిగి అభ్యర్థులను నిలబెటిన ఎంఎల్‌సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానాలకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ చివరి రోజైన గురువారం పట్టభద్రుల స్థానాలకు 28 నామినేషన్లు, ఉపాధ్యాయ స్థానానికి 8 నామినేషన్లు దాఖలయ్యాయి.

విద్య, వైద్యం అందరికీ అందాలంటే..

పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందాం : మిరియం వెంకటేశ్వర్లు



గూడూరులో...

ప్రజాశక్తి -గూడూరు/ క్యాంపస్

విద్య, వైద్యం అందరికీ అందాలన్నా, ధరలు అందుబాటులోకి రావాలన్నా పట్టభద్రులందరూ ఏకమై పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర రాజకీయ విద్య సబ్‌కమిటీ నాయకులు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. గూడూరు సిఐటియు కార్యాలయంలో టి.వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిరియం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మార్చి 13న ఎమ్మెల్సీల ఎన్నికలు జరుగుతున్నాయని, ఉపాధ్యాయులకు సంబంధించి అభ్యర్థి పి.బాబురెడ్డి, పట్టభద్రులకు సంబంధించి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి బరిలో ఉన్నారన్నారు. గతంలో ఈ రెండు నియోజకవర్గాల్లోనూ విఠపు బాలసుబ్రమణ్యం, యండపల్లి శ్రీనివాసులురెడ్డి ఇద్దరూ గెలుపొందారని గుర్తు చేశారు. వాళ్ల కాలపరిమితి అయిపోవడంతో మళ్లీ ఈ స్థానాల నుంచి పోటీ చేస్తున్న బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. చట్టసభల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎక్కువభాగం ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ వారి సొంత ప్రయోజనాలను మాట్లాడుకునే సందర్భాలే ఉన్నాయన్నారు. అయితే విఠపు బాలసుబ్రమణ్యం, యండపల్లి శ్రీనివాసులురెడ్డి ప్రజా సమస్యలను శాసనమండలిలో ప్రశ్నించేవారని గుర్తు చేశారు. వైద్యం, విద్య ఖరీదైపోయాయని, అవి అందరికీ అందుబాటులోకి రావాలంటే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను శాసనమండలిలోకి పంపించాలన్నారు. చదువుల తల్లిసరస్వతిని నడిరోడ్డులో వేలం వేసే పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవి రమణ, టి.వెంకటరామిరెడ్డి, జోగి శివకుమార్, ఆర్.శ్రీనివాసులు, బివి రమణయ్య, కె.శ్రీనివాసులు, నారి వెంకటప్పయ్య, బి.చంద్రయ్య, ఎస్.ముత్యాలయ్య, పుట్టా శంకరయ్య, అడపాల ప్రసాద్, కె.సురేష్, పి.మణి పాల్గొన్నారు.

ప్రజాసంఘాల విస్తృత ప్రచారం

తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు విజయంకై శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో విస్తత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలిని, సిపిఎస్ రద్దు, ఉద్యోగులకు ప్రతినెల ఒకటో తారీఖున జీతాలు చెల్లించాలని మెరుగైన పిఆర్సి, పెండింగ్ డీఏలు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్, సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ తదితర సమస్యలు పరిష్కారానికి మీ కోసం శాసనమండలిలో గళం వినిపిస్తామని చెప్పారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పొక్కిరెడ్డి బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వర రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.జయచంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవకష్ణ, ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గండికోట నాగ వెంకటేష్, ఎస్ఎఫ్ఐ ఉరుకుందు పాల్గొన్నారు.



క్యాంపస్‌లో...

జీవించే హక్కును కాలరాస్తున్న పరువు హత్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మహిళ అధ్యయన కేంద్రం, మహిళా అధ్యయన విభాగం, విమెన్ సేఫ్టీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న 'భారతదేశంలో పరువు హత్యలు- సామాజిక మానసిక కారకాలు' అనే జాతీయ సదస్సును గురువారం సావేరి సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ హానర్ కిల్లింగ్ చట్ట విరుద్ధమైన, క్రూరమైన చర్యగా అభివర్ణిస్తూ ఇవి సమాజంపై, దేశాభివద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. కుటుంబ సభ్యుల అభీష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకోవడం ద్వారా కుటుంబ గౌరవం, పరువు ప్రతిష్టా దెబ్బతింటున్నాయన్న మిషతో యువతీ యువకులను కుటుంబ సభ్యులు దారుణంగా హతమారుస్తున్నారన్నారు. ఈ సమస్యను రూపుమాపాలి అంటే ఆలోచన ధోరణిలో మార్పు రావాలన్నారు. పరువు హత్యలు జీవించే హక్కును కాల రాస్తున్నాయన్నారు. పూర్వపు ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున మాట్లాడుతూ హానర్ కిల్లింగ్ ప్రపంచాన్ని వేధిస్తున్న సమస్యని, కుటుంబ గౌరవం ఆడపిల్లతోనే ముడిపడి ఉందనే నెపంతో స్త్రీ పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు పరువుకు ప్రతీకగా పరిగణిస్తున్నారు. ఈ పరువు హత్యలు మధ్యతరగతి కుటుంబాలలో ఎక్కువగా జరుగుతున్నాయని, అభద్రతాభావం వల్లనే తల్లిదండ్రులు అంతర్ కులాల ప్రేమని, వివాహాలను అంగీకరించలేకపోతున్నారన్నారు. ప్రజల మనస్తత్వంలో మార్పు చోటు చేసుకోవాలని, తల్లిదండ్రులు, పిల్లల మధ్య పటిష్టమైన బంధాన్ని ఏర్పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ అనూరాధ మాట్లాడుతూ జీవితంలో వేసే ప్రతి అడుగు పైన అమ్మాయిలకు అవగాహన ఉండాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య రజిని మాట్లాడుతూ సమాజంలో నెలకొని ఉన్న లింగ వివక్షను రూపుమాపినప్పుడే గౌరవం పేరుతో జరుగుతున్న ఈ దారుణ హత్యలను అరికట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర ఇన్‌చార్జ్ హెడ్, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ నీరజ , విమెన్ సేఫ్టీ సెంటర్ డైరెక్టర్ ఆచార్య సీతాకుమారి, సెమినార్ కో డైరెక్టర్ డాక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు.



రైతుభరోసా కేంద్రం రైతులకు సాయపడాలి

వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలక్రిష్ణ ద్వివేది

ప్రజాశక్తి - పిచ్చాటూరు

రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఉపయోగపడేలా ఉండాలని, సిబ్బంది రైతులకు అండగా ఉంటూ సాయపడాలని వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. నారాయణవనం మండలంలోని భీమలచెరువు పంచాయతీ రైతు భరోసా కేంద్రాన్ని గురువారం మధ్యాహ్నం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొప్పగా రైతులకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో గ్రామంలోనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి అందులో భాగంగా రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలను స్థాపించిందన్నారు. రైతులకు కావాల్సిన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో రైతుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న పండ్ల తోటలు, పువ్వుల పెంపకం కలిగి ఉన్నాయన్నారు. రైతులకు సమాచారాన్ని అందించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ప్రసాద్ రావు, మనోహర్ బాబు, రవికుమార్, సతీష్, సునీల్, అడిషనల్ అధికారులు రమేష్, శశికళ, హరిత, ఎంపీడీవో శేఖర్, వ్యవసాయ అధికారి శోభారాణి, వెంకటస్వామి పాల్గొన్నారు.



వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా అజయ్‌కుమార్

ప్రజాశక్తి-తిరుపతి సిటి వైఎస్‌ఆర్‌సిపి యువజన విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులుగా ఆరె అజయ్‌కుమార్‌ను నియమిస్తూ వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు. పార్టీ యువజన విభాగంలో కీలకంగా పని చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి పార్టీ జిల్లా అధ్యక్షులుగా అందజేశారు. జిల్లా అధ్యక్షులుగా నియమింపబడిన ఆయన తిరుపతి ఎంఎల్‌ఏ భూమన కరుణాకర్‌రెడ్డి, నగర డిప్యూటీ మేయరు భూమన అభినయ్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాంత్‌రెడ్డికి పలువురి అభినందనలు

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రెక్టార్ గా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన ఆచార్య వంగిమళ్ళ శ్రీకాంత్ రెడ్డిని రాష్ట్ర ఉన్నతవిద్య మండలిలో సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఉత్తర్వులు ఇచ్చారు. చిత్తూరు జిల్లాలోని కలకడ మండలం ఎర్రకోట పల్లెలో వంగిమల్ల శ్రీనివాసులు రెడ్డి, కల్పలతారెడ్డి దంపతులకు జన్మించారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఎల్ ఆర్ జి ఉన్నత పాఠశాల అనంతపురంలో చదివారు. ఇంటర్మీడియట్ ఎస్ వి జూనియర్ కళాశాలలో, బిఎస్సి డిగ్రీ ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో పూర్తి చేశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ సైకాలజీ 1982లో పూర్తి చేశారు. అదే విభాగంలో 1990లో పిహెచ్డి పూర్తి చేసి 1996లో రీడర్ గా జాయిన్ అయ్యారు. అప్పటినుంచి ఇప్పటివరకు అసోసియేట్ ఆచార్యులుగా, ఆచార్యులుగా అంచలంచలుగా ఎదుగుతూ వర్సిటీలో అనేక పదవులను అలంకరించి సమర్థవంతంగా నిర్వహించారు. సైకాలజీ విభాగాధిపతిగా, బిఓఎస్ చైర్మన్ గా సైన్స్ కళాశాల డిప్యూటీ వార్డెన్ గా, సైన్స్ కాలేజీ వార్డెన్ గా, సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గా, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ గా, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గా, వర్సిటీ సిడిసి డీన్ గా పలు రకాల పదవులను సమర్థవంతంగా నిర్వహించి పరిపాలనదక్షుడిగా పేరు గడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఏపీ ఆర్ సెట్ కన్వీనర్ గా, స్కూటా సెక్రటరీగా సమర్థవంతంగా విధులను నిర్వహించారు. ఆయన పర్యవేక్షణలో 13 ఎంఫిల్ డిగ్రీలు, 18 పీహెచ్డీ డాక్టరేట్, 3 పోస్ట్ డాక్టరేట్ ఫెలోషిప్ అవార్డులు ప్రదానం చేశారు. ఆచార్య శ్రీకాంత్ రెడ్డి జాతీయస్థాయిలో మనోవిజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన వివిధ రకాలైనటువంటి అసోసియేషన్లలో సభ్యులుగా ఉన్నారు. ఎస్వియు ఉపకులపతి ఆచార్య కే రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఓయండి హుస్సేన్, మానసిక అధ్యయన శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, పిడిఎఫ్ స్కాలర్లు, సీనియర్ ఫెలోషిప్ పరిశోధకులు, విద్యార్థి సంఘం నేతలు డాక్టర్ ప్రహల్లాద రెడ్డి, డాక్టర్ పాకనాటి హరికష్ణయాదవ్, డాక్టర్ ఎ.సుదర్శన రెడ్డి, హరి, ఆది, వీరారెడ్డి, మదన్, వివేక్, తదితరులు పుష్పగుచ్చాలు అందించి, దుశ్శాలువతో సత్కరించారు.

గురువులు మార్గదర్శకులు

క్యాంపస్ : జీవితంలో ఉన్నతస్థాయికి చేరడానికి గురువులను మార్గదర్శకులుగా భావించాలని టీటీడీ చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశ్శైలేంద్ర కోరారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో 2022- 23 విద్యాసంవత్సరానికి గాను స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఏవో మాట్లాడుతూ మనలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి లోపాలు సరిదిద్ది సమాజానికి పరిచయం చేసేవారు గురువులన్నారు. అధ్యాపకులు చెప్పిన విషయాలను చక్కగా విని జీవితాన్ని సరిదిద్దుకోవాలని కోరారు. భగవద్గీత ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డిఈవో డా.ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కళాశాల నాక్ ఎ గ్రేడ్ సాధించి దేశంలోనే ఉత్తమ కళాశాలగా గుర్తింపు పొందిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ డా.కె.మహదేవమ్మ మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ మార్కుల మెరిట్ ఆధారంగా విద్యార్థి సంఘ సభ్యులను ఎంపిక చేశామని తెలిపారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది ఆన్‌లైన్ అడ్మిషన్ల ద్వారా 606 మంది విద్యార్థినులు ప్రవేశం పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జి డా. భువనేశ్వరిదేవి, విశ్రాంత తెలుగు విభాగాధిపతి డా. ప్రేమావతి, ఐఐసి కో ఆర్డినేటర్ డా.ఉమారాణి, వార్డెన్ డా.విద్యుల్లత పాల్గొన్నారు.

పంటల ఉత్పత్తి విధానంపై విస్తృత చర్చ

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో 'కోస్తా ప్రాంతంలో వ్యవసాయ పర్యావరణ స్థితిస్థాపకత పెంపు' అనే అంశంపైన నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో రెండో రోజైన గురువారం వ్యవసాయ, అనుబంధ రంగాలలో శాస్త్ర, సాంకేతిక పరిశోధనలు వాటి ద్వారా కోస్తా ప్రాంతాలలో ఉత్పాదకత పెంపుదలకు విస్తతంగా చర్చాగోష్ఠులు నిర్వహించారు. ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రూ), కేంద్ర చౌడు నేలల పరిశోధనా సంస్థ (ఐకార్) సంయుక్త సహకారంతో భారతీయ తీర ప్రాంత వ్యవసాయ పరిశోధన సంఘం నిర్వహిస్తున్న అచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి.రమణ, శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకరరెడ్డి పర్యవేక్షణలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పశువైద్య కళాశాల ఆడిటోరియంలో నాలుగు వేదికలు ఏర్పాటు చేసి చర్చాగోష్ఠులను నిర్వహించారు. ప్రధానంగా కోస్తా ప్రాంతాలు, ముంపునకు గురి అయ్యే ప్రాంతాలలో సమగ్ర నీటి యాజమాన్యం, పంటల సరళి పై డాక్టర్ కేజీ మండల్ ఉపన్యసించారు. ఉద్యాన పంటలలో సమగ్ర సస్యరక్షణ, పంటల అభివద్ధిలో జన్యు విధానాలు, పంటలు ఉత్పాదకతపై జీవ జీవేతర పరిస్థితుల ప్రభావం, సహజ వనరుల యాజమాన్యం, కోస్తా సముద్ర తీర ప్రాంతాలలో జీవవైవిద్యం, సాంఘిక ఆర్థిక బాధ్యతలపై సాంకేతికత ప్రభావం అనే ప్రధానాంశాలపై నిపుణులు అభిప్రాయాలను వ్యక్తపరిచారు. రైతుల సమస్యల్ని కళ్లకు కట్టినట్లు తెలియజెప్పే నాటికలు, గీతాలాపనలు కార్యక్రమాలు అలరించాయి. ఈ జాతీయస్థాయి సదస్సుకు కార్యనిర్వహణ కార్యదర్శిగా తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం మత్తికా శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నాగమాధురి వ్యవహరించారు.

క్రోమా మ్యాజికల్‌లో సమ్మర్ ఆఫర్లు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

దేశంలో మొట్టమొదటి ఓమ్నీ ఛానల్ ఎలక్ట్రానిక్స్ కరిటైలర్, టాటాగ్రూప్‌కు చెందిన క్రోమా మ్యాజికల్ సమ్మర్ ఆఫర్లను ప్రకటించింది. ఎండ వేడిమి ఈ సారి ఎక్కువగా ఉంటుందనే అంచనాలతో పాటుగా ఈ సారి ఎండలు ముందే రావడంతో ఎయిర్ కండీషనర్లు, రూమ్ కూలర్లు, రిఫ్రిజిరేటర్లు వినియోగం ఎక్కువగా ఉండనుంది. దీంతో క్రోమా సంస్థ సమ్మర్ సేల్స్‌లో భాగంగా ఏసిలు, కూలర్లు, ఫ్రిజ్‌లపై 45 శాతం తగ్గింపు ధరలను ప్రకటించింది. స్ప్లిట్ ఏసిలు రూ.27,990 నుంచే ప్రారంభం, రూమ్ కూలర్లు రూ.5990, క్రోమా ఫ్రాస్ట్‌ఫ్రీ రిఫ్రిజిరేటర్లు రూ.21,990 రూపాయలకే అందిస్తున్నారు. సమ్మర్ సేల్స్‌లో భాగంగా జ్యూసర్‌మ ఇక్సర్, గ్రైండర్లు, ఫ్యాన్లు, ఇతర అప్లయన్స్‌పై కూడా డీల్స్‌ను అందిస్తోంది. తాము అందించే సమ్మర్ ఆఫర్లను వినియోగాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజల ఆశిస్సులతో పాదయాత్ర

యువగళం సభల్లో నారా లోకేష్

ప్రజాశక్తి - రేణిగుంట

యువగళం పాదయాత్రకు అడ్డంకులు ఎన్ని సృష్టించినా దూసుకుపోతామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ప్రజల ఆశిస్సులు ఉన్నంత వరకూ పాదయాత్ర ఆగే ప్రసక్తే లేదన్నారు. అడ్డుకోవాలని చూస్తే దండయాత్రేనని ఉద్ఘాటించారు. 25వ రోజు యువగళం పాదయాత్ర గురువారం రేణిగుంట మండలంలోని జీపాలెం నుంచి ప్రారంభమయ్యింది. గ్రామాలలో పసుపుపచ్చ తోరణాలతో బాణసంచా పేలుస్తూ, మంగళ హారతులతో పూల వర్షం కురిపిస్తూ డప్పుల వాయిద్యాలతో, గజమాలలతో సాదర స్వాగతం పలికారు. నల్లపాలెం, నీలసానిపేట గ్రామాల్లో భారీగా ప్రజలు పాల్గొని నారా లోకేష్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ హారతులు పట్టారు. గాజులమండ్యం గ్రామంలోకి చేరుకోగానే క్రేన్ సాయంతో భారీ గజమాలతో స్వాగతం పలికారు. నారా లోకేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకోడానికి యువగళం పాదయాత్ర చేపట్టానని, విద్యార్థులు, ప్రజలు, నిరుద్యోగ యువత సమస్యలను తెలుసుకుంటున్నానని అన్నారు. ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డు పెట్టుకుని అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తోందన్నారు. అయినా ప్రజల ఆశిస్సులతో యువగళం పాదయాత్ర దిగ్విజయంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వ అధికారులను, పోలీసులను అడ్డు పెట్టుకుని యువగళం పాదయాత్రను ఆపలేరన్నారు. ఎవరైనా ఆపడానికి ప్రయత్నిస్తే పాదయాత్ర దండయాత్రగా సాగుతుందన్నారు. గాజులమండ్యంలో సిఐ ఆరోహనరావు మైకులో ప్రసంగించరాదని, ఎన్నికల కోడ్ అమల్లో ఉందని అభ్యంతరం తెలిపారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. డిఎస్‌పి రామచంద్ర, గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గాజులమండ్యం హరిజనవాడ, సూర్యనారాయణపురం వద్దకు చేరుకోగానే గ్రామస్తులు స్వాగతం పలికారు. సిబిఐడి కాలనీ వద్ద నారా లోకేష్ ప్రజలకు అభివాదం చేస్తూ పసిబిడ్డను ఎత్తుకుని ముద్దాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు అమరనాథ్‌రెడ్డి, పరసారత్నం, మాజీ ఎంఎల్ఎలు సునీల్‌కుమార్, సుగుణమ్మ, శ్రీకాళహస్తి టిడిపి ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, టిడిపి నాయకులు రావిళ్ల మునిరాజా, చెంచయ్యానాయుడు, చంద్రారెడ్డి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని వై కన్వెన్షన్ హాలులో యాదవులతో ముఖాముఖి నిర్వహించారు. దంపూరు భాస్కర్‌యాదవ్, తూకివాకం భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.



జై జవానే... జైకిసాన్..!


విరబూసిన మామిడిపూత

ఆదర్శరైతుగా రవికుమార్‌నాయుడు

'జవాన్‌గా ఉన్నపుడు దేశానికి సేవ చేశాడు.. ఇపుడు రైతుగా మామిడి మొక్కలకు సేవ చేస్తూ ఈ ఏడాది విరబూసిన మామిడిపూత విరగకాస్తుందా? లేదా? అని దోలాయమానంలో ఉన్నాడు రైతు రవికుమార్‌నాయుడు. ఒకప్పుడు ఆదర్శ రైతుగానూ అవార్డులను అందుకున్న రవికుమార్‌నాయుడుకు మొక్కలన్నా, కోళ్ల పెంపకమన్నా మక్కువ. ఈ కారణంతోనే మామిడితోటలోనే షెడ్డు వేసుకుని మొక్కలను చూసుకుంటూ, కోళ్లను పెంచుకుంటూ కాలం గడుపుతున్నాడు.. ఈ ఏడాది మామిడిపూత విరగకాయడంతో శ్రమకు తగ్గ ఫలితం వస్తుందో లేదోనని మదనపడుతూనే మొక్కలను పెంచి పోషిస్తున్నాడు. మామిడి మొక్కలతో తన జీవితం ఎలా అల్లుకుపోయిందో అని ఆయన మాటల్లోనే...

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

మాది గాజులపెళ్లూరు గ్రామం.. 15 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నాను. పదేళ్లుగా కష్టపడి మొక్కలను పెంచుతున్నారు. అయితే పూత పూసి కాయ వచ్చేసరికి వడగాలులు, తుపాన్లు రావడంతో ఎంత కష్టపడి పనిచేసినా ఫలితం దక్కేది కాదు. ఈ ఏడాది పూత బాగా వచ్చింది. కష్టానికి తగ్గ ఫలితం వస్తుందన్న ఆశతో మామిడి తోటలోనే నివాసం ఏర్పరచుకున్నాను. పూత నిలిచేందుకు అనేక రకాలైన మందులను పిచికారీ చేసి దాన్ని నిలబెట్టేందుకు కష్టపడుతున్నాను. ప్రతి చెట్టును నా సొంత బిడ్డగా చూసుకుంటాను. ఆ చెట్టుకు కావాల్సిన పోషకాలన్నీ సకాలంలో అందిస్తాను. గత పదేళ్లుగా మామిడి పంట సాగు చేస్తుంటే పెట్టుబడులు కూడా రాలేదు. ఈ ఏడాది పూసిన పూతంతా కాయ అయితే అప్పుల ఊబి నుంచి బయట పడతానన్న నమ్మకం కలుగుతోంది. మామిడి తోటలోనే వెయ్యి కోడి పిల్లలను పెంచుతున్నాను. రోజంతా మొక్కలతోనూ, కోళ్లతోనూ గడపడం ఎంతో ఆనందంగా ఉంటుంది. గతంలో ఎన్నోసార్లు ఆదర్శరైతుగా అవార్డులు తీసుకున్నాను. అయితే ఆ ఆనందం అప్పటివరకే. మామిడితోటకు చేసే సేవ, కోళ్ల పెంపకం తనకు జీవితాంతం ఆనందాన్ని ఇస్తుందని 'ప్రజాశక్తి'కి తెలిపారు. భార్యాపిల్లలకు ఏదైనా అవసరం ఉంటే తనకు చెబుతారని, మొక్కలు, కోళ్లు చెప్పలేవని, అందుకే వాటి వెన్నంటే వాటికి కావాల్సినవి అందిస్తుంటానని సంతోషం వెలిబుచ్చారు.





మామిడితోటలో కోళ్ల పెంపకం

భారత్‌లో జీ-20 జరగడం గర్వకారణం




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: భారత్‌లో జీ-20 జరగడం అందరికీ గర్వకారణమని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత్‌లో సెప్టెంబర్‌లో జరుగనున్న జీ-20 సదస్సుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధ్యాపకులు నరసింహులు జీ-20 ఏర్పాటు వెనుక చరిత్రను వివరించారు. ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాసులు 2023 సదస్సుకు సంబంధించిన లోగో వెబ్సైట్ వివరాలను తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీ విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఓబుల్‌రెడ్డి



ప్రజాశక్తి-క్యాంపస్: వైఎస్ఆర్ విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం రామాపురానికి చెందిన ఓబుల్‌రెడ్డి నియమితులయ్యారు. ఎస్వీ యూనివర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన ఓబుల్‌రెడ్డి సుదీర్ఘకాలం విద్యార్థి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. గతంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడిన తర్వాత, వైఎస్ఆర్ విద్యార్థి సంఘంలో ఓబుల్‌రెడ్డి చురుగ్గా వ్యవహరించారు. సమైక్యాంధ్ర ఉద్యమం ప్రత్యేక హోదాపై ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఓబుళ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలకు, విద్యార్థులకు, యువతకు, మహిళలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అన్ని వర్గాల ప్రజలకు తెలియజేస్తామన్నారు. తన నియామకానికి తోడ్పడిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలు



ప్రజాశక్తి- పిచ్చాటూరు : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామని, 685 మంది పట్టభద్రులు, 12 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని తహశీల్దార్ మధుసూదన్‌రావు తెలిపారు. పిచ్చాటూరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను గురువారం తహశీల్దార్ మధుసూదన్, పుత్తూరు రూరల్ సి.ఐ సురేష్ కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

గృహప్రవేశానికి మాజీ ఎమ్మెల్యే హేమలత



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: వేణుగోపాలపురం ఎంపీటీసీ సభ్యులు మనోహర్‌నాయుడుకు చెందిన నూతన గృహప్రవేశానికి సత్యవేడు నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యే హేమలత, ఇన్‌ఛార్జి డాక్టర్ హెలెన్ హేమలత హాజరయ్యారు. జిల్లా మాజీ గ్రంథాలయ ఛైర్మన్ కన్నయ్యనాయుడు, మధునాయుడు, కరుణాకర్‌నాయుడు, రమేష్, మునిరాజా, నరసింహులు, భాస్కర్ యాదవ్, రఘుపతి నాయుడు, వెంకటేష్, గోపినాయుడు, మల్లి నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో తాగునీటి వసతి



ప్రజాశక్తి-గూడూరు: రోటరీ క్లబ్ 118వ వార్షికోత్సవ సందర్భంగా గూడూరు పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో తాగునీటి బోరు, కుళాయిలను మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ ప్రారంభించారు. అలాగే రెండో పట్టణ పరిధిలోని మినీ బైపాస్ వద్ద రాజమాత రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుషెల్టర్‌ను రాజమాత దేవి శిష్యులు, వైసీపీ నాయకులు గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. కమిషనర్ సాయినాథ్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ స్పందించి నూతన బోరు ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి వసతి కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కిరణ్‌చక్రవర్తి, రవికుమార్, పీవీ కష్ణయ్య, మునిగిరీష్, నందిమండలం బాలకష్ణంరాజు, జనార్దన్‌రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో నీరు విడుదల చేయాలి



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: నెలవాయి, కుమార వెంకటాపురం, తలారి వెట్టు పంచాయతీలలోని రైతులు పంట పొలాలకు నీరు విడుదల చేయాలని గురువారం మాజీ గ్రంథాలయ ఛైర్మన్ కన్నయ్యనాయుడు ఆధ్వర్యంలో తెలుగుగంగ డీఈ పెంచలయ్యకు వినతి పత్రం అందించారు. ప్రస్తుతం పండిస్తున్న వరి, వేరుశనగ, కూరగాయల పంటలు నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాంచ్ కాలువలకు గేట్లు ఏర్పాటు చేయాలని, మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో తలారి వెట్టు, నెలవాయి, కేవీబీపురం రైతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తేనే ఉజ్వల భవిష్యత్

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



ప్రజాశక్తి-సత్యవేడు: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని.. దేశం అభివద్ధి సాధించాలంటే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం స్థానిక బాబు జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ పరంధామ్ ఆధ్వర్యంలో కళాశాల 14వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించాలని.. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుకొస్తోందని.. ఈక్రమంలోనే ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులమ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, సురుటపల్లి ఆలయ ఛైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సోమశేఖర్, సీనియర్ నాయకుడు మాస్టర్ స్కూల్ అధినేత చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ కుంభాభిషేకం





ప్రజాశక్తి-పుత్తూరుటౌన్

పట్టణంలోని పురపాలక సంఘం పరిధిలోని విద్యానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయం మహా కుంభాభిషేక మహోత్సవం వేడుకల్లో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె రోజా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. పురోహితులు వేదమంత్రాలతో మంత్రిని ఆశీర్వదించారు. అనంతరం మంత్రిని శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్ జాన్‌కెనడీ, నాయకులు గజేంద్రనాయుడు, తాతయ్య, ఆలయ బోర్డు ఛైర్మన్లు, మెంబర్లు పాల్గొన్నారు.

- విద్యానగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవంలో నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆయన్ను ఘనంగా సన్మానం చేశారు. నియోజకవర్గ ఎస్సీసెల్ ప్రెసిడెంట్ ఆనంద్, మహేష్, పురుషోత్తం, చందు, శ్రీహరి, అనిల్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా హరినాథ్



ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట మండల యూటీఎఫ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా హరినాథ్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం పక్కన ఉన్న ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో యు.టి.ఎఫ్ బలోపేతానికి ఉపాధ్యాయులందరూ కలిసికట్టుగా కషి చేయాలని కోరారు. అనంతరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా వెంకటస్వామి, అధ్యక్షులు హరినాథ్, సహాధ్యక్షులుగా బి.వి.రాయ్, ఉపాధ్యక్షురాలుగా మీనా, మండల ప్రధాన కార్యదర్శిగా కె.చంద్రశేఖర్, కోశాధికారిగా మురళీ, మండల కార్యదర్శులుగా పరంధామరెడ్డి, పుణ్య ప్రసాద్, నవీన్, అంజిబాబు, మహబూబ్ బాషా, పెంచలస్వామి, అమత ధనమ్మ, మహిళా కమిటీ కన్వీనర్-శశికళ, కో-కన్వీనర్ దీప, సి.పి.ఎస్ కన్వీనర్‌గా ఎస్.చాంద్‌బాషా, మహిళా కన్వీనర్ గా రోజా, ఐక్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్‌గా వరదారెడ్డి, మండల ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సి.వెంకటసుబ్బయ్య, కో- కన్వీనర్ కేతిరెడ్డి సత్యంలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దేవరాల నిర్మల, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి, రేణిగుంట మండల ఇన్‌ఛార్జి దండు రామచంద్రయ్య, విశిష్ట అతిథిగా తిరుపతి రూరల్ యు.టి.ఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎంపీ సందానిని హత్య చేసింది మునిప్రకాష్

- గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి



ప్రజాశక్తి-వెంకటగిరి: ఈనెల 12న డక్కిలి మండలంలో జరిగిన ఆర్ఎంపీ డాక్టర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. గురువారం గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు సందానికి ఆర్ఎంపీ డాక్టర్‌గా మంచి గుర్తింపు ఉందని.. రోగులు అతని వద్దకే వెళుతున్నారని.. అతడిని చంపితే రోగులు తన వద్దకే వస్తారనే ఉద్దేశంతో పక్క గ్రామంలో ఆర్ఎంపీగా ప్రాక్టీసు పెట్టుకున్న బొలిగల మునిప్రకాష్ హత్యకు పథకం రచించాడన్నారు. రూ.2 లక్షలకు మాట్లాడుకొని మొదట రూ.15 వేలు ఇచ్చి పదిమందితో హత్య చేయించాడు. హత్యకు ప్రధాన కారకుడు లింగసముద్రం ఆర్ఎంపీ డాక్టర్ మునిప్రకాష్ కావడంతో అతడిని ఎ-1 ముద్దాయిగా గుర్తించామన్నారు. తిరుపతికి చెందిన పాత నేరస్థులు అనిల్, ప్రేమ్, పెట్లూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సుబ్రమణ్యంలతోపాటు మిగిలిన ఏడుగురు కలిసి హత్యకు పాల్పడ్డారు. నెలరోజులుగా రెక్కీ నిర్వహించి హత్యకు ప్రణాళిక చేశారని.. నిందితులపై కేసు నమోదు చేసి వారిని రిమాండుకు పంపుతున్నట్లు వివరించారు.

చదువుతో పేదరికాన్ని జయించాలి



ప్రజాశక్తి-కేవీబీపురం: కసితో చదివి కషితో ఉన్నత స్థాయికి ఎదగాలని.. పేదరికం చదువుకు అడ్డుకాకూడదని ఆర్డీవో రామారావు విద్యార్థులకు సూచించారు. కేవీబీపురంలోని కేజీబీ బాలికల వసతి గహాన్ని గురువారం ఆర్డీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి సమాజంలో మంచి స్థాయికి ఎదగాలని.. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని తెలిపారు. గతంలో మన దేశ రాష్ట్రపతిగా ఉన్న అబ్దుల్ కలాం ఒక పేద సాధారణ కుటుంబంలో జన్మించి ఎంతో కష్టపడి చదివి దేశంలోనే అత్యున్నత స్థానమైన రాష్ట్రపతిగా ఎదిగారని, అదేవిధంగా ఎదిగిన ట్లయితే చదువు నేర్పిన ఉపాధ్యాయులు సైతం ఎంతో ఆనందపడుతారన్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు ద్వారకానాథ్‌రెడ్డి, ఆర్ఐ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఏప్రిల్ 7న జీ1117 చిత్రం చిత్రీకరణ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇండియన్ ఫిలిం ఫ్యాషన్ మీడియా నెట్వర్క్ ఇంటర్నేషనల్ ఫిలిం ప్రొడక్షన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న జీ1117 చిత్రం చిత్రీకరణ తిరుపతిలో ప్రారంభించనున్నట్లు చిత్ర నిర్మాత, దర్శకులు మర్రి గిరిరెడ్డి తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర కథానాయికి సారికతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సంస్థ ద్వారా జీ1117 చిత్రంతో పాటు ప్రొడక్షన్ నంబర్7, ఇలవలసి చిత్రాలు చిత్రీకరించనున్నామన్నారు. మొదట చిత్రంగా జీ1117 చిత్రాన్ని తిరుపతిలో చిత్రీకరణను ప్రారంభిస్తున్నామన్నారు. ఇందులో తనతో పాటు రాజశేఖర్, సారిక ముఖ్యపాత్రలో నటించనున్నట్లు తెలిపారు. సంగీతాన్ని గౌరహరి, శంకర్ కెమెరా వేణు అరుట్ల తమ సహకారాన్ని అందిస్తున్నారని వివరించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలోని డిగ్రీ పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం ఒకటో సెమిస్టర్, రెండో సంవత్సరం మూడో సెమిస్టర్ పరీక్షలను మార్చి 10వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని.. పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను మార్చి 10వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కి తావు లేకుండా కట్టుదిట్టంగా పరీక్షల ఏర్పాటుకు నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిగ్రీ కళాశాల పరీక్షలకు సంబంధించిన తేదీలను ఆయా కళాశాలలకు పంపించామని హాల్ టిక్కెట్లు కళాశాల నుంచి విద్యార్థులు తీసుకొని సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరై ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు



ప్రజాశక్తి-బాలాయపల్లి : మండలంలోని కయ్యూరు గ్రామం నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఓ జేసీబీని బాలాయపల్లి ఎస్సై వీరనారాయణ గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కయ్యూరు రెవెన్యూ భూమిలో అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి ఓ జేసిబితో సహ మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. మండల పరిధిలో అక్రమంగా ఇసుక, గ్రావెల్, మట్టి రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేదురుమల్లిని కలిసిన సురేష్‌రెడ్డి



ప్రజాశక్తి-బాలాయపల్లి: వెంకటగిరి నియోజకవర్గ నుంచి నియమితులైన పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షులు నెమలపూడి సురేష్‌రెడ్డి బుధవారం తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు, వెంకటగిరి సమన్వ యకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తమపై నమ్మకంతో అనుబంధం విభాగాల అధ్యక్షుడిగా నియమించినందుకు బాధ్యతగా పార్టీని మరింత బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలి



ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఎంపీడీవో సురేష్ బాబు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సుస్థిరాభివద్ధి లక్ష్యాలు సాధించాలని సూచనలు చేశారు. 0-5 సంవత్సరాల పిల్లలకు సంబంధించి అభివద్ధి ప్రణాళిక రూపొందించారు. సమావేశానికి మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ పర్యవేక్షకులు, మండల విస్తరణ అధికారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పది పదవులతో బీసీల సాధికారతా..?



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసీపీ అధికారంలోకి రావడానికి విశేషంగా కృషి చేసిన బీసీలకు పది పదవులు ఇచ్చి బీసీ సాధికారత సాధించినట్లు గొప్పలు చెప్పుకుంటున్న సజ్జల రామకృష్ణారెడ్డిని చూస్తే జాలేస్తోందని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు గురువారం ఎద్దేవా చేశారు. తన విజయం కోసం శక్తి వంచన లేకుండా శ్రమించిన కార్యకర్తలను, నాయకులను బలి చేసి, తనను ఓడించాలని ఎవరైతే కష్టపడ్డారో అటువంటి వారికి ఎమ్మెల్సీ, ఇతర నామినేటెడ్ పదవులు ఇచ్చిన గొప్ప నాయకత్వం వైసీపీ సొంతమని విమర్శించారు. కర్ర పెత్తనం చెలాయించే కీలక పదవులు జగన్ రెడ్డి సామాజిక వర్గానికి సొంతం చేసి, బంట్రోతు పదవులు బడుగు బలహీన వర్గాలకు అప్పగించిన గొప్ప రాజకీయ చతురుడు జగన్మోహన్ రెడ్డి అని ఉమేష్ ఆరోపించారు.

ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ



ప్రజాశక్తి-పెళ్లకూరు: చింతపూడి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీలో చేపడుతున్న చెరువు పనులను గురువారం తిరుపతి జిల్లా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో అవసరమైన పనులను గుర్తించి జాబ్ కార్డుల్లో ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలని సూచించారు. అలాగే నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. చింతపూడి చెరువు ఆక్రమణలను తహశీల్దార్ సహకారంతో తొలగించాలని ఏపీవో దయానందానికి సూచించారు. చెరువు ఆక్రమణ విషయమై తహశీల్దార్ దష్టికి తీసుకెళ్లి రాతపూర్వకంగా తెలియజేసి ఆక్రమణ తొలగించాలని ఆదేశించారు. ఈసీ భానుశేఖర్, టీఏ కష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ న్యాయం చేయాలి



ప్రజాశక్తి -గూడూరు : తిరుపతి జిల్లాలోని మాదిగలకు రాజకీయ న్యాయం చేయాలని ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను మాదిగ వర్గాలకు కేటాయించాలని వైసీపీ ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకష్ణారెడ్డిని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం కోరారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా, తిరుపతి జిల్లాలో ఇప్పటివరకు ఎస్సీ స్థానాలలో అన్ని ఎమ్మెల్యే , ఎంపీ స్థానాలను మాల వర్గానికి కేటాయించారని పేర్కొన్నారు. గురువారం వైసీపీ కేంద్ర కార్యాలయం అయిన తాడేపల్లిలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పరశ పోగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సజ్జల రామకష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా ఆదూరు రత్నం కలిశారు. 2024 లో జరగబోవు సాధారణ ఎన్నికల్లో ఓ ఎమ్మెల్యే, తిరుపతి ఎంపీ స్థానాలను మాదిగలకు కేటాయించాలని కోరారు. 2019 ఎన్నికల్లో మాదిగలంతా వైసీపీకే ఓట్లేశారని తెలిపారు. ఈయన వెంట నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు పోలేపల్లి రమణ రావు, జనరల్ సెక్రెటరీ పారి భాస్కర్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

తిరుమల శ్రీవారి దర్శన టిక్కెట్లు విడుదల

ప్రజాశక్తి-తిరుమల: తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం విడుదల చేయనుంది. రేపు ఉదయం 10 గంటలకు మార్చి నెలకు సంబంధించిన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో భక్తులకు అందుబాటులో ఉంచనుంది. అలాగే ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్లు రేపు మధ్యాహ్నం 2 గంటలకు ఆన్‌లైన్‌లో పెట్టనుంది. అలాగే సాయంత్రం 4 గంటలకు మార్చి నెలకు సంబంధించిన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ వర్చువల్ సేవాటిక్కెట్ల కోటాను, సంబంధిత దర్శన టిక్కెట్ల కోటాను విడుదల చేస్తారు.

శ్రీవారి సేవలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-తిరుమల: రాష్ట్రంలో అరాచకాలు సృష్టించి ప్రజల వద్ద సానుభూతి పొందాలని చూస్తున్నారని రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తే నిఘా అంటున్నారని, బందోబస్తు ఏర్పాటు చేయకపోతే తమకు రక్షణ లేదని చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి వర్గం సంతోషంగా ఉండటే కేవలం జగన్ పరిపాలనని ఆయన తెలిపారు.

వైఎస్ఆర్ సేవాదళ్ అధ్యక్షుడిగా ఢిల్లీబాబురెడ్డి



ప్రజాశక్తి-తొట్టంబేడు: కాసారం గ్రామానికి చెందిన కాపిరెడ్డి ఢిల్లీ బాబు రెడ్డిని వైసీపీ సేవాదళ్ అధ్యక్షులుగా ఎంపికైనట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే కార్యకర్తగా మండలంలో పేరున్న వ్యక్తికి పదవి రావడం చాలా సంతోషకరమని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.